
సాక్షి
బాపట్ల
మంగళవారం ၊ 1 ၊ ఏప్రిల్ ၊ 2025



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి సోమవారం చిలకలూరిపేట గణపవరానికి చెందిన గ్రంథి శ్రీనివాసరావు కుటుంబం రూ. 1,01,116 విరాళాన్ని అందించింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 519.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,050 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వైభవంగా పోలేరు తల్లి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడులో గ్రామ దేవత పోలేరు తల్లి తిరునాళ్లను సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు చేసి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త చాగంటి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

యువత భరోసా కోసం ఉద్యోగాలు కల్పనకు చర్యలు



చినగంజాం: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం చినగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో ఏర్పాట్లను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణ శాఖామంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్య ప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు, చీరాల శాసన సభ్యులు ఎం ఎం కొండయ్య, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జే వెంకట మురళి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జేసీ ప్రఖర్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ తుషార్ డూడీ



చినగంజాం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జిల్లా ఎస్పీ సోమవారం చినగంజాం మండలం కొత్త గొల్లపాలెం గ్రామంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం మొత్తం 904 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని వీరిలో ఒకరు అడిషనల్ ఎస్పీ, ఏడుగురు డీఎస్పీలు, 27 మంది సీఐలు, 67 మంది ఎస్ఐలు ఉన్నారన్నారు. మొత్తం బందోబస్తును 11 సెక్టార్లుగా విభజించామన్నారు. అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె సీసీఎస్ డీఎస్పీలు రామాంజనేయులు, మొయిన్, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్‌లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జెస్సీరాజ్‌కు పతకాలు



మంగళగిరి: తైవాన్‌లో ఈనెల 26 నుంచి 31 వరకు జరిగిన తైవాన్ ఇంటర్నేషనల్ చాంపియన్ షిప్ స్కేటింగ్ పోటీలలో మంగళగిరికి చెందిన జెస్సీరాజ్ అద్భుత ప్రతిభ కనపరచింది. సోలో డ్యాన్స్, కపుల్ డ్యాన్స్ విభాగాలలో రెండు గోల్డ్ మెడల్స్, పెయిర్ స్కేటింగ్‌లో సిల్వర్, ఇన్ లైఫ్ ఫ్రీ స్టైల్‌లో బ్రాంజ్ మెడల్ సాధించింది. సోమవారం విజేత జెస్సీరాజ్‌కు ఏషియన్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ పతకాలు అందజేసి అభినందించారు.

గుంటూరు నగరంలో ఎస్పీ పర్యటన

నగరంపాలెం: గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లో సోమవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణను ఆయన పరిశీలించారు. పట్టాభిపురం పీఎస్ పరిధిలోని పట్టాభిపురం, కోబాల్ట్‌పేట మసీదులు, లాలాపేట పీఎస్ పరిధిలోని ఎత్తురోడ్డు మసీదు, పాత గుంటూరు పీఎస్ పరిధిలోని ఆంధ్ర ముస్లిం కళాశాల, నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి సమీపంలోని ఈద్గాల వద్ద బందోబస్త్‌ను పరిశీలించారు. ప్రార్థనలు ముగిసే వరకు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రార్థనలు ముగిశాక ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఆయన సూచించారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ప్రార్థనలు చేసుకునేలా ఆయా ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు ట్రాఫిక్ పీఎస్), సింగయ్య (పశ్చిమ ట్రాఫిక్ పీఎస్), వైవీ సోమయ్య (పాతగుంటూరు పీఎస్) ఉన్నారు.

విజనరీ మహామిథ్య

ఇచ్చిన హామీలెన్నో..! ఒక్కటీ నెరవేరలే..

- ఐటీ పార్కు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో!
- సూపర్ సిక్స్ గాలికొదిలేసినట్లేనా ?
- చేనేతలను పట్టించుకోరా..!
- నేడు సీఎం చంద్రబాబు బాపట్ల జిల్లాకు రాక


చీరాల: జిల్లాను సుందరంగా తీర్చిదిద్దుతా. చేనేతలు, అన్నదాతలను ఆదుకుంటా. ఐటీ హబ్ ఏర్పాటు చేస్తా. అన్ని రంగాల్లో బాపట్ల జిల్లాను ముందంజలో నిలుపుతానని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారో అని ప్రజలు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 10 నెలలు కావస్తున్నా బాపట్ల జిల్లాకు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదని ఆవేదన చెందుతున్నారు. గిట్టుబాటు ధరల్లేక అన్నదాతలు ఆక్రోశిస్తున్నారు. చేనేత రంగం ఆసరా కోసం అర్రులు చాస్తోంది. నిరుద్యోగులు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం నిరీక్షిస్తున్నారు. మత్స్యకార భరోసా అందక గంగపుత్రులు అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు మంగళవారం బాపట్ల జిల్లా చినగంజాం మండలం గొల్లపాలెంకు రానున్న దృష్ట్యా ఆయన ఇచ్చిన హామీల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. అమలు చేస్తారా? లేదా అని నిలదీసేందుకు సిద్ధమవుతున్నారు.

చేనేతలకు చేయిచ్చిన చంద్రబాబు..

చేనేత రంగానికి బాబు ప్రభుత్వం చేయిచ్చింది. బాపట్ల జిల్లాలోని చీరాల, పర్చూరు, వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో సుమారు 15 వేల మగ్గాల వరకు ఉండగా 20 వేల చేనేత కుటుంబాలు ఉన్నాయి. 50 శాతం మంది చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారు. కనీస వేతన చట్టం ప్రకారం ఒక కార్మికుడికి రోజుకు రూ.206 చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ కూలి కార్మికులకు అందడం లేదు. మగ్గాలపై పీస్ వర్క్ చేస్తున్నారనే కారణంతో కనీస వేతన చట్టం వర్తింపజేయలేమని కార్మికశాఖ చేతులెత్తేసింది. దీంతో హోటల్‌లో పని చేసే స్వీపర్ల కంటే చేనేత కార్మికుడికి కూలి తక్కువ వస్తోంది.. కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తే కార్మికులకు ప్రయోజనం ఉంటుంది.

రైతులకు ప్రోత్సాహం ఎక్కడ ?

అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.384.07 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా నేటికీ అన్నదాతలను ఆదుకున్న దాఖలాలు లేవు. గత ప్రభుత్వం జిల్లాలో 1,92,037 మంది రైతులకు రూ.1187 కోట్లు ఇచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్లో పెట్టుబడి సాయం ఇవ్వలేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించలేదు. చంద్రబాబు హామీతో అన్నదాతలు పండించిన పంటలు దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ అన్నదాతలను నట్టేట ముంచుతున్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.



ఈ హామీల మాటేమిటీ బాబు..!

బాపట్ల జిల్లాను టూరిజం హబ్‌గా మారుస్తానని, కొమ్మమూరు కెనాల్ ఆధునికీకరిస్తామని, చీరాలకు ఐటీ హబ్ తీసుకొస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు అలవిగాని హామీలు ఇచ్చారు. అధికారం చేపట్టి ఇన్ని రోజులైనా వాటి గురించి పల్లెత్తి మాట్లాడడం లేదు.

మరిన్ని బూటకపు హామీలు

డ్వాక్రా సంఘాలకు రూ.10 లక్షల రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు, స్వయం ఉపాధికి రూ.10 వేల కోట్లు, రూ.5 వేల కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరణ తదితర పథకాలను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. వీటి సంగతీ అతీగతీ లేదు.

ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: ఆర్టీసీ కొత్త సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. రేపల్లె ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన 10 సర్వీసులను మంత్రి సత్యకుమార్ యాదవ్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణతో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. తిరుపతికి రెండు సర్వీసులు, గుంటూరు, విజయవాడలకు ఎనిమిది సర్వీసులను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. తిరుపతికి సర్వీసులను ఏర్పాటు చేయటంతో తీరప్రాంత ప్రజల చిరకాలవాంఛ నెరవేరిందన్నారు. రేపల్లె నుంచి నేరుగా తిరుపతికి సర్వీసులను ప్రారంభించటం ఆనందంగా ఉందన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు. ప్రజాసంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ–4 సర్వేకు సహకరించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్–6 సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రేపల్లె వైద్యశాలను 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసినట్టు వివరించారు. అనంతరం ఆర్టీసీ బస్సు సర్వీసులను జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, డిపో మేనేజర్ సుఖవాసి సునీల్‌కుమార్, వివిధ యూనియన్ల నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని మోర్లవారిపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించి, చాట్రగడ్డలోని సనాతన వేదాంత నిష్ఠాశ్రమ శ్రీ సరస్వతీ విద్యామందిర్ పాఠశాల నూతన భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్

ఆనందాల రంజాన్



రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకున్నారు. ఫలితంగా జిల్లావ్యాప్తంగా మసీదులు, ఈద్గాలు కళకళలాడాయి. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేసవి దృష్ట్యా మసీదులు, ఈద్గాల వద్ద షామియానాలు వేశారు. తాగునీటి సదుపాయం కల్పించారు. బాపట్ల జమేదార్ పేటలో జరిగిన ప్రార్థనల్లో మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. ప్రార్థనలలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు షేక్ సయ్యద్ పీర్ పాల్గొన్నారు.

– బాపట్ల

వక్ఫ్‌బోర్డు సవ'రణం'



చీరాల నవాబుపేట ఈద్గాలో నల్లబ్యాడ్జీలు ధరించి ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై ముస్లింలు భగ్గుమన్నారు. సోమవారం అద్దంకి నియోజకవర్గ వ్యాప్తంగా నిరసన ర్యాలీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంసీపీఐయూ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ మొహిద్దీన్ బాషా రెడ్ బాషా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు భూములపై తెచ్చిన చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రదర్శనల్లో బుజ్జిగారి ఖాదర్, మస్తాన్ పిట్టమళ్ల, ఖాసిం కొమ్మరపల్లి బుజ్జి, మొహతాజ్ బాషా, షంషుద్దీన్, హఫీజ్ కాలేషా దరియా హుస్సేన్, గొమ్మరపల్లి మీరా తదితరులు పాల్గొన్నారు. చీరాలలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. నవాబుపేటలో వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా గళమెత్తారు.

– చీరాలటౌన్, అద్దంకి



అద్దంకిలో వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలపుతున్న ముస్లింలు

ని'యంత్రా'ణేదీ!

- యంత్రాలతో ఇసుక తవ్వకాలపై ఆందోళన
- గాజుల్లంక కృష్ణానది వద్ద ఇసుక లారీలు నిలిపివేత
- భూగర్భ జలాలు అడుగంటడంపై నిరసన
- కూటమి నేతలు కూలీలకు పనులు దూరం చేయడంపై ధ్వజం

కొల్లూరు : కూటమి నాయకులు యంత్రాలతో ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టడంపై ప్రజలు ఆందోళనకు దిగారు. ఆదివారం రాత్రి గాజుల్లంక సమీపంలో భారీ యంత్రాలతో ఇసుక తవ్వి వందలాది లారీలలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. భారీ పొక్లెయిన్లు, జేసీబీలతో ఇసుక తవ్వకాలు చేపట్టడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి తాగు, సాగు నీటి సమస్య ఉత్పన్నమవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ధ్వజమెత్తారు. కూలీలకు పని దూరం అవుతోందని ఆవేదన చెందారు. ఆదివారం రాత్రి 8 గంటల నుంచి మొదలైన ఆందోళన అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగింది. లారీలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో క్వారీ నిర్వాహకుల అనుయాయులు ఆందోళనకారులతో చర్చలు జరిపారు. ఇబ్బందులు లేకుండా చేస్తామని హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు నిరసనకారులు ఆందోళన విరమించారు.



గాజుల్లంక కృష్ణా నదిలో ఇసుక లారీకి అడ్డుగా కూర్చుని నిరసన తెలుపుతున్న దృశ్యం



గాజుల్లంక చినరేవులో ఇసుక లారీలను నిలిపి ఆందోళన చేస్తున్న గాజుల్లంక వాసులు

మీడియా ప్రతినిధికి బెదిరింపులు

ఘటనాస్థలానికి చేరుకున్న మీడియా ప్రతినిధిపై క్వారీ నిర్వాహకుల అనుచరుడు ఒకరు బెదిరింపులకు దిగారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా.. అధికారులు స్పందించకపోవడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మద్యం మత్తులో ఆటోలను ఢీకొట్టిన కారు

- రెండు ఆటోల్లో 17 మందిపైనే ప్రయాణికులు
- ఎనిమిది మందికి గాయాలు

చినగంజాం: మద్యం మత్తులో కారు నడుపుతూ ఎదురుగా వస్తున్న కూలీల ఆటోలను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి పైనే గాయాలపాలైన ఘటన సోమవారం సాయంత్రం చినగంజాం రొంపేరు బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. చినగంజాం పల్లెపాలెం, చీరాల బోయనవారిపాలెం గ్రామానికి చెందిన పలువురు మహిళా కూలీలు నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామంలో కూలీ పనుల కోసం వచ్చి సోమవారం సాయంత్రం పనులు ముగించుకొని ఆటోలలో ఇంటికి తిరిగి వెళ్తున్నారు. వారి ఆటోలు రొంపేరు బ్రిడ్జి సమీపానికి వచ్చేసరికి చీరాల నుంచి వస్తున్న ఏపీ 31 బీకే 1881 నంబరుతో ఉన్న కారులో డ్రైవర్ పూటుగా మద్యం సేవించి ఎదురుగా వస్తున్న కూలీల ఆటోను ఢీ కొట్టాడు. ముందు వెళ్తున్న బోయనవారిపాలెం ఆటోను బలంగా ఢీ కొట్టడంతో వెనుక ఉన్న ఆటో దానిని ఢీ కొట్టింది. వెనుక ఉన్న ఆటోలో మహిళా కూలీలకు స్వల్ప గాయాలు కాగా ముందు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒక వృద్ధురాలికి తీవ్ర రక్తస్రావం అయ్యింది. కారు, ఆటో డ్రైవర్‌లు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. గాయాలపాలైన మహిళా కూలీలను చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న బీహార్‌కు చెందిన శంషాద్ పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలించినట్లు తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న కొండేపి శివజ్యోతి కాలు విరిగినట్లు చీరాల ఔట్ పోస్టు ఏఎస్ఐ శ్యాం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఆయన వివరించారు.



ప్రమాదం జరిగిన ఘటనా స్థలంలో నుజ్జయిన ఆటో



క్షతగాత్రులను అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

ఆశ'లారి'పోయే

పెనుమూడి వారధి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

దేవుని సన్నిధిలో బిడ్డ ఊయల వేడుక కోసం బయలుదేరిన ఆ కుటుంబం ఆశలు ఆరిపోయాయి. రెప్పపాటులో ఎదురొచ్చిన మృత్యువు నలుగురిని బలితీసుకుంది. ముక్కుపచ్చలారని మూడునెలల పసికందునూ పొట్టనబెట్టుకుంది. కన్న తల్లిదండ్రులను, కడుపున పుట్టిన బిడ్డలను కోల్పోయి.. జీవిత భాగస్వామి తీవ్రగాయాలతో మృత్యువుతో పోరాడుతుంటే విషణ్ణవదనంతో లోలోన గుండెలవిసేలా రోదిస్తున్న క్షతగాత్రుడిని చూసి బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. దేవుడా.. ఇదేమి అన్యాయం అంటూ విలపిస్తున్నారు. కృష్ణాజిల్లా పులిగడ్డ టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన తెనాలి చెంచుపేట ఇందిరా నగర్‌లో విషాదఛాయలు నింపింది.

- కారును ఢీకొన్న లారీ
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- విషమంగా మరొకరి పరిస్థితి
- ఊయల వేడుక కోసం మోపిదేవి వెళ్తుండగా విషాదం
- మృతులు తెనాలి ఇందిరానగర్ వాసులు

తెనాలిరూరల్/అవనిగడ్డ: తెనాలి చెంచుపేట ఇందిరానగర్‌కు చెందిన గిడుగు రవీంద్ర మోహన్‌బాబు అలియాస్ రవి (55), అరుణ(50) భార్యాభర్తలు. మోహన్‌బాబు ప్రైవేటు ఎలక్ట్రీషియన్. వీరిది ప్రేమ వివాహం. వీరికి ఓ కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు సందీప్ గుంటూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ తెనాలిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. ఈయనకు భార్య పల్లవి, కూతురు సాత్విక(6), కుమారుడు షణ్ముఖ(మూడునెలలు)ఉన్నారు. షణ్ముఖ ఊయల వేడుక మోపిదేవి సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. దీనికోసం సోమవారం మోహన్‌బాబు, అరుణ, సందీప్, పల్లవి, సాత్విక, షణ్ముఖ కారులో బయలుదేరారు. సందీప్ కారు నడుపుతుండగా మిగిలిన కుటుంబ సభ్యులు సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. పులిగడ్డ–పెనుమూడి వారధి దాటగానే టోల్‌ప్లాజా సమీపంలో ఎదురుగా వస్తున్న పామాయిల్ లోడుతో వస్తున్న లారీ ఒక్కసారిగా కారును ఢీకొంది. ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న మోహన్‌బాబు, వెనుక సీటులో కూర్చున్న అరుణ, షణ్ముఖ అక్కడికక్కడే మరణించారు. సాత్విక తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి చేరింది. వెనుక సీటులో తల్లి పల్లవి ఒడిలో ఉన్న మూడునెలల షణ్ముఖ ఎదరు సీటు తగలడంతో కుదుపునకు సీటు కింద భాగంలోకి వెళ్లి పడి మరణించాడు. ప్రమాదం విషయం తెలియగానే హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ శ్రీనివాస్ తొలుత మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను సిబ్బంది సాయంతో బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్వికను, పల్లవిని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీటు కింద పడి ఉన్న మూడునెలల షణ్ముఖను ఆ తర్వాత బయటకు తీశారు. సాత్వికను మెరుగైన చికిత్స నిమిత్తం మచిలీపట్నం తరలిస్తుండగా మరణించింది. పల్లవి పరిస్థితి విషమంగా ఉంది. ఆమెతోపాటు స్వల్పంగా గాయపడిన సందీప్‌ను విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతం మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి మూడు కిలో మీటర్ల దూరం. మరో ఐదు నిముషాలు గడిస్తే వారంతా ఆలయానికి వెళ్లి ఊయల వేడుక నిర్వహించేవారు.



ప్రమాద స్థలిలో నుజ్జు నుజ్జయిన కారు



మరణించిన మూడునెలల బాలుడు







గిడుగు రవీంద్రమోహన్‌బాబు, అరుణ, సాత్విక (పాతచిత్రాలు)

క్లుప్తంగా

ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు



బాపట్లటౌన్‌: రంజాన్‌ పండుగను పురస్కరించుకొని ఎస్పీ తుషార్‌ డూడీ ఆదేశాల మేరకు ముస్లిం ప్రార్థన ప్రదేశాలల్లో సోమవారం పోలీసులు పటిష్టంగా బందోబస్తు నిర్వహించారు. ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రార్థనలకు ఎలాంటి ఆటంకాలు, అవాంతరాలు ఏర్పడకుండా బందోబస్తు చేపట్టారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. కుల మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా సందేశాలు, వదంతులు వ్యాప్తి చేస్తే ఇటువంటి వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సోషల్‌ మీడియాపై నిఘా ఉంచామని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. పట్టణంలో ఎలాంటి ట్రాఫిక్‌ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

అయోధ్య రాముడి ధనస్సు శోభాయాత్ర



తాడేపల్లి రూరల్‌: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన చల్లా శ్రీనివాస్‌ శర్మ అయోధ్య రామమందిరానికి విరాళంగా కిలో బంగారం, 10 కిలోల వెండితో తయారు చేయించిన ధనస్సు అందజేశారు. ఈ ధనస్సును శోభయాత్ర దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యక్రమ నిర్వాహకులు కనసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఉండవల్లి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం కాపులబజార్‌లోని కోదండ రామాలయంలో భక్తుల దర్శనార్థం ఆ ధనస్సును ఉంచారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ శర్మ మాట్లాడుతూ దేశంలో ప్రతి హిందువు ఈ ధనస్సును దర్శనం చేసుకునేందుకు వీలుగా శోభాయాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ యాత్ర నవంబర్‌ నెలలో అయోధ్యకు చేరుకుంటుందని, ఈ ధనస్సును స్వామివారికి అలంకరణ చేస్తారని తెలిపారు. గంగోత్రి పీఠాధిపతి అద్వైతనంద మహరాజ్‌, గౌడీమఠం పీఠాధిపతి భక్తి సుందర్‌, మహామండేశ్వర్‌ కృష్ణ కిషోర్‌ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'స్లాట్‌ రిజిస్ట్రేషన్‌'

- ఫైలెట్‌ ప్రాజెక్ట్‌ కింద గుంటూరు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం
- రిజిస్ట్రేషన్‌ కోసం ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్‌ బుక్‌ చేసుకోవాలి



గుంటూరు ఎస్‌ఆర్వోలోని రిజిస్ట్రేషన్‌ కోసం వేచి ఉన్న ప్రజలు(ఫైల్‌)

గుంటూరు వెస్ట్‌: సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో రద్దీని తగ్గించేందుకు రాష్ట్ర స్టాంపులు రిజిస్ట్రేషన్‌ శాఖ కార్యాలయం కూటమి ప్రభుత్వ ఆదేశాలతో స్లాట్‌ బుకింగ్‌ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ఏప్రిల్‌ 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా హెడ్‌క్వార్టర్‌లోని సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లో అందుబాటులోకి రానుంది.

ప్రతి రోజూ 72 స్లాట్స్‌...

ఏదైనా ఆన్‌లైన్‌ కేంద్రంలో ముందుగా సంబంధిత రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అనువైన, ఖాళీ ఉన్న సమయంలో స్లాట్‌ బుక్‌ చేసుకోవాలి. అందులో కేటాయించిన సమయంలో కార్యాలయానికి వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్‌ చేయించుకునే వెసులుబాటు ఉంటుంది. గుంటూరు సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో 72 స్లాట్స్‌ను ప్రతి రోజూ అందుబాటులో ఉంచారు. స్లాట్‌ బుక్‌ చేయకుండా రిజిస్ట్రేషన్‌ చేయడానికి అవకాశముండదని అధికారులు చెబుతున్నారు. నరసరావుపేటలో జాయింట్‌ సబ్‌ రిజిస్ట్రార్‌-1, బాపట్లలోని జాయింట్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లోనూ స్లాట్‌ విధానం అందుబాటులో ఉంది. ముందుగా పైలెట్‌ ప్రాజెక్టును అమలు చేసి అందులోని ఇబ్బందులను అధిగమించి త్వరలోనే రాష్ట్రంలోని ప్రతి సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయాల్లోనూ అమలు చేయనున్నారు. స్లాట్‌ బుక్‌ చేసుకుని దస్తావేజు మొత్తం సిద్ధం చేసుకుని ఎస్‌ఆర్వో కార్యాలయంలోకి వెళ్లాల్సి ఉంటుంది.

అవగాహన కల్పిస్తాం

ఈ విధానం చాలా సులభతరం. స్లాట్‌ విషయంలో కొన్ని రోజులపాటు మేం ప్రజలకు అవగహన కల్పిస్తాం. పెద్దగా ఇబ్బందులేమీ ఉండవు. గంటల కొద్దీ వేచి ఉండకుండా త్వరగానే రిజిస్ట్రేషన్‌ చేయించి పంపేందుకే ప్రభుత్వం ఈ నూతన విధానం అమలులోకి తెచ్చింది. ఇది పూర్తిగా ప్రజల సౌలభ్యం కోసం మాత్రమే....

– షరీల్‌ బాబు, జాయింట్‌ సబ్‌రిజిస్ట్రార్‌-1, గుంటూరు

తెనాలి వైద్యశాలలో అరుదైన సర్జరీ

- తొడల మధ్యలో ఇరుకున్న ఆటో హ్యాండిల్‌ను తొలగించిన వైద్యులు
- వ్యక్తికి తప్పిన ప్రాణాపాయం



రెండు తొడల మధ్యలో ఇరుకున్న హ్యాండిల్‌తో వైద్యశాలకు వచ్చిన ప్రసాద్‌

తెనాలిఅర్బన్‌: రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు ఆటో హ్యాండిల్‌ రెండు తొడల మధ్య దిగిన ఓ వ్యక్తికి ఆపరేషన్‌ చేసి ప్రాణప్రాయాన్ని తప్పించారు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల వైద్యులు. సేకరించిన వివరాలు, వైద్యుల కథనం ప్రకారం .. తెనాలి పట్టణంలోని సుల్తానాబాద్‌కు చెందిన ప్రసాద్‌ (28) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఆటోనగర్‌ వైపు తన ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రసాద్‌ నడుపుతున్న ఆటో హ్యాండిల్‌ అతని రెండు తొడల మధ్యలో ఇరుక్కుపోయింది.
ఎంత సేపు ప్రయత్నించి హ్యాండిల్‌ బయటకు రాకపోవడంతో స్థానికులు దానిని కట్‌ చేసి, అతడిని జిల్లా వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న సీనియర్‌ ఆర్థోపెడిక్‌ డాక్టర్‌ జె.హనుమంతరావు రంజాన్‌ పండుగ సందర్భంగా సోమవారం సెలవు అయినప్పటికీ హుటాహుటిన వైద్యశాలకు వచ్చారు. ఓపీ నుంచి అదే స్ట్రక్చర్‌పై థియేటర్‌కు తీసుకువెళ్లి అత్యవసర శస్త్ర చికిత్స చేశారు. రెండు తొడల మధ్యలో ఇరుకున్న హ్యాండిల్‌ను తొలగించడంతో పాటు లోపల దెబ్బతిన్న నరాలను కూడా సరిచేసి కుట్లు వేశారు. వెంటనే సర్జరీ చేయడం వలన ప్రాణపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో ఆర్థోపెడిక్‌ డాక్టర్‌ వెంకటేశ్వరరావు, ఎనస్తీషియా వైద్యులు యశస్వి, డాక్టర్‌ తులసీ పాల్గొన్నారు. రోగి తరపు బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏ మృతదేహం లభ్యం



ఆవుల కోటయ్య (ఫైల్‌)

పిడుగురాళ్ల: అప్పుల బాధ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వీఆర్‌ఏ ఆవుల కోటయ్య(50) మృతదేహం పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు లాకుల వద్ద సోమవారం లభ్యమైందని పట్టణ పోలీసులు తెలిపారు. బొల్లాపల్లి మండలం రెమిడిచర్ల గ్రామానికి చెందిన ఆవుల కోటయ్య వీఆర్‌ఏగా గ్రామంలో విధులు నిర్వహిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై ఈ నెల 29న భార్యకు, చిలకలూరిపేటలో ఉన్న మనవరాలికి వద్దకు వెళ్లి వస్తానని చెప్పి స్వగ్రామం నుంచి బయలుదేరారు. మార్గం మధ్యలో కారంపూడి సాగర్‌ బ్రిడ్జి నిలబడి మనవరాలికి వీడియో కాల్‌ చేసి చనిపోతున్నట్లు చెప్పి, సాగర్‌ కెనాల్‌లో దూకాడు. మనవరాలు చెప్పిన ఆధారంగా భార్య, ఇద్దరు కుమారులు, బంధువులు కలిసి కారంపూడి నుంచి నాగార్జున సాగర్‌ కుడి కాలువ వెతుకుతూ వస్తుండగా పిడుగురాళ్ల మండలంలోని జూలకల్లు లాకుల కింద కోటయ్య మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీరాం వెంకట్రావు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి ఆత్మహత్య



వినుకొండ: శావల్యాపురం, వినుకొండ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వృద్ధుడు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మార్కాపురం నుంచి రేపల్లె వైపు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్‌ రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 70 సంవత్సరాలు ఉంటుదని, తెల్ల రంగు నిండు చేతుల చొక్కా, నీలం రంగు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడని చెప్పారు.

రేపల్లె నుంచి దూరప్రాంతాలకు సర్వీసులు నడపాలి



మంత్రి అనగాని, ఏపీఎస్‌ ఆర్టీసీ చైర్మన్‌ కొనకళ్లకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రేపల్లె రూరల్‌: తీరప్రాంతమైన రేపల్లె ఆర్టీసీ నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను నడపాలని పట్టణ ఆదర్శ వేదిక కార్యదర్శి యడ్లపల్లి కిషోర్‌ బాబు విన్నవించారు. రేపల్లె ఆర్టీసీ అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరుతూ డిపో వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌, ఏపీఎస్‌ ఆర్టీసీ చైర్మన్‌ కొనకళ్ల నారాయణలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రేపల్లె – విశాఖపట్నం – శ్రీకాకుళం, రేపల్లె – మచిలీపట్నం – కాకినాడ – విశాఖపట్టణం – శ్రీకాకుళం పోర్టు, రేపల్లె – తిరుపతి – బెంగళూరు, రేపల్లె – హైదరాబాద్‌ (బెర్త్‌తో కూడుకున్న బస్సులు)లతో పాటు శ్రీశైలం, భద్రాచలం వంటి పుణ్యక్షేత్రాలకు సర్వీసులు నడపాలన్నారు. అదేవిధంగా మోపిదేవి మీదగా చల్లపల్లికి మినీ సర్వీసులను ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌.సాయికృష్ణమాచార్యులు, కొడాలి ఆనందరావు, నటరాజ్‌ ఉన్నారు.

ఏకాదండయ్య పంతులు జీవితం స్ఫూర్తిదాయకం

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్‌ ఎస్‌ఆర్‌ఎల్‌ నాగేశ్వరరావు



రమణరావు, కమలవల్లి దంపతులను సత్కరిస్తున్న జస్టిస్‌ నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఎనిమిది దశాబ్దాల క్రితం అప్పటి కాలమాన పరిస్థితుల కనుగుణంగా ట్రస్ట్‌ ఏర్పాటు చేసి విద్య, వైద్య, ఆధ్యాత్మిక, ఆదరణ గృహాల ద్వారా సమాజ హిత సేవలందించిన ఏకాదండయ్య పంతులు జీవితం వర్తమాన, భవిష్యత్‌ తరాలకు ఆదర్శప్రాయమని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్‌ ఎస్‌ఆర్‌ఎల్‌ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏకాదండయ్య పంతులు చారిటీస్‌ ఆధ్వర్యంలో సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్‌ కళాశాల సుధర్మ ఆడిటోరియంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయ శర్మ నూతన పంచాంగ శ్రవణం గావించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్‌ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు బహుముఖ సేవలను కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన న్యాయవాది కొండూరి కృష్ణారావు మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు ధార్మిక సంస్థలను చిరకాలంగా మేనేజింగ్‌ ట్రస్టీ కోటంరాజు శేష చంద్రమౌళీశ్వరరావు నేతృత్వంలో మిగతా ట్రస్టీలు కాపాడుతూ సామాజిక సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రముఖ వైద్యులు వి.రమణరావు కమలవల్లి దంపతులను ఘనంగా సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ట్రస్టీ కొండూరి నందకిషోర్‌, ట్రస్టీలు కేఎస్‌ఆర్‌ కుటుంబరావు, భట్రాజు కృష్ణ కిషోర్‌, కేసానుపల్లి వెంకట శ్రీరామ సుబ్బారావు, నెప్పల్లి వరప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ మార్చాలంటూ ధర్నా

- పండుగనాడు విద్యుత్‌ లేదంటూ ఆగ్రహం
- ఫిరంగిపురం సొలస బస్టాండు వద్ద వాహనాలు నిలిపివేత



సొలస బస్టాండు వద్ద ధర్నా చేస్తున్న ముస్లింపేట వాసులు

ఫిరంగిపురం: మండలకేంద్రం ఫిరంగిపురంలోని ముస్లింపేట వద్దనున్న జెండాచెట్టు వద్ద గల విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌తో నానా ఇక్కట్లు పడుతున్నామని దానిని మార్చాలంటూ ముస్లింపేట వాసులు సోమవారం సాయంత్రం సొలస బస్టాండు వద్ద రోడ్డుపై బైఠాయించారు. సేకరించిన వివరాల ప్రకారం.. ముస్లింపేట వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ సరిలేని కారణంగా విద్యుత్‌ సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని తెలిపారు. రంజాన్‌ పండుగ కావడంతో విద్యుత్‌ సరఫరా నిలిచిపోవడంతో నానా ఇబ్బందులు పడ్డామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌ స్థానంలో కొత్తది ఏర్పాటుచేయాలని ఎన్నిసార్లు చెప్పినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొలస బస్టాండువద్ద గుంటూరు – కర్నూలు రాష్ట్ర రహదారిపై బైఠాయించడంతో ఇరువైపులా వాహనాలు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి స్థానికులతో మాట్లాడారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులతో ఫోనులో మాట్లాడటంతో ప్రస్తుతం విద్యుత్‌ సరఫరా చేస్తామన్నారు. మంగళవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ ఏర్పాటుచేసి విద్యుత్‌ సరఫరాకు అంతరాయం లేకుండా చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

దండ కారణ్యంలో మారణకాండ ఆపాలి

పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకుల డిమాండ్‌



ఆర్టీసీ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న పౌరహక్కులు, ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: దండకారణ్యంలో మారణకాండను వెంటనే నిలిపివేసి సుప్రీం కోర్టు న్యాయమూర్తితో ప్రభుత్వం విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. స్థానిక బస్టాండ్‌ సెంటర్‌లో సోమవారం పౌర హక్కులు, ప్రజా సంఘాల నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మధ్య భారతంలో, ముఖ్యంగా దండ కారణ్యంలో నిత్యం ఎన్‌కౌంటర్ల పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను హత్యలు చేస్తున్నారని తెలిపారు. ఆయుధాలతో మావోయిస్టులు సంచరిస్తే వారిని అరెస్ట్‌ చేయాలన్నారు. వేలాది మంది సాయుధ బలగాలు చుట్టుముట్టి మట్టు పెట్టడం, అణిచివేస్తాం, తుడిచేస్తాం అనే పదాలు రాజ్యాంగబద్ధం కాదని పేర్కొన్నారు. ఆరు నెలల పసి పిల్లలతో పాటు, యువకులు, మహిళలను పెద్దఎత్తున కాల్చి చంపడం, 2026 మార్చి 31 నాటికి అందరిని నిర్మూలిస్తామని హోం మంత్రి అమిత్‌షా బహిరంగ ప్రకటన చేస్తూ సవాల్‌ విసరడం చట్టబద్ధం, న్యాయబద్ధం కాదని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాలలో మిలిటెంట్‌ సంస్థలతో కాల్పుల విరమణ ఒప్పందాలు చేసుకొని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ప్రకటిస్తున్న పాలకులు మావోయిస్టులు, ఆదివాసీల విషయంలో వారిని నిర్మూలించడమే తమ లక్ష్యం అనడంలోనే దుర్బుద్ధి కనిపిస్తోందని వివరించారు. మధ్య భారతంలో ఉన్న ఖనిజాలు, అటవీ సంపదను తరలించుకపోవటానికి అంబానీ లాంటి కార్పొరేటర్లతో ఒప్పందాలు చేసుకున్నారన్నారు. వాటిని అమలు చేయాలంటే అక్కడ వీరు అడ్డమని, వారిని చంపడమే పరిష్కారమని పాలకుల భావిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు దీంట్లో జోక్యం చేసుకొని న్యాయ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్‌ చేశారు. 2024 జనవరి నుంచి నేటి వరకు 500 మందిని చంపేశారని, తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి చర్చలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్‌ సెక్రటరీ వినుకొండ పేరయ్య పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు



స్వాధీనం చేసుకున్న గంజాయి

మూడు కిలోల గంజాయి స్వాధీనం

తాడేపల్లి రూరల్‌: తాడేపల్లి రూరల్‌ పరిధిలోని వడ్డేశ్వరం, రాధారంగా నగర్‌, కొలనుకొండ ప్రాంతాల్లో నివాసముంటూ గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను తాడేపల్లి పోలీసులు సోమవారం అరెస్ట్‌ చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈసందర్భంగా సీఐ కల్యాణ్‌రాజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌, నార్త్‌జోన్‌ డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు గంజాయి విక్రయాలు, కొనుగోలుపై దృష్టి సారించామని, వడ్డేశ్వరం, రాధారంగానగర్‌కు చెందిన ముత్యాల మనోజ్‌ కుమార్‌ ఏజెన్సీ ఏరియాల నుంచి గంజాయి తీసుకువచ్చి వడ్డేశ్వరంలో నివాసముంటున్న షేక్‌ అమిద్‌ బాషా, కొలనుకొండకు చెందిన ప్రవీణ్‌తో కలసి గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్నారనే సమాచారం వచ్చిందన్నారు. దీంతో వారిపై నిఘా ఏర్పాటు చేయగా ఎయిమ్స్‌ రోడ్‌లోని బ్రహ్మానందపురంకు వెళ్లే రహదారిలో ఈ ముగ్గురు గంజాయి అమ్మేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద వున్న 3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు ఆయన తెలిపారు. గంజాయి విక్రయించే, సేవించే వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎడ్ల పందేల్లో అపశ్రుతి

- బండ్ల లాగుడు పోటీల్లో కాలుజారి పందెపు ఎద్దుకు ఫ్రాక్చర్‌
- 1962 అంబులెన్స్‌ వాహనంలో గన్నవరం తరలింపు



అంబులెన్స్‌ వాహనంలోకి చేర్చిన పందెపు ఎద్దు

తెనాలి: స్థానిక మార్కెట్‌ యార్డులోని జరుగుతున్న ఆలపాటి శివరామకృష్ణయ్య జాతీయస్థాయి ఎడ్ల పందేల్లో మూడోరోజైన సోమవారం రాత్రి అపశ్రుతి చోటుచేసుకుంది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి దగ్గర్లోని కొమెరపూడి గ్రామానికి చెందిన యర్రా వెంకటేశ్వరరావు పందెపు ఎడ్ల జత బండలాగుడు పోటీల్లో పాల్గొన్నపుడు ఒక ఎద్దుకు కాలుజారి ఫ్రాక్చర్‌ అయింది. అక్కడే ఉన్న పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్‌ డైరెక్టర్‌(జేడీఏ) డాక్టర్‌ ఒ.నరసింహారావు పర్యవేక్షణలో పశువైద్యులు పరిశీలించి ప్రాథమిక వైద్యం చేశారు.

■ అత్యవసర శస్త్రచికిత్స కోసం గన్నవరంలోని పశువైద్య కళాశాలలోని సర్జరీ విభాగానికి తరలించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. మొబైల్‌ వెటర్నరీ అంబులెన్స్‌ వాహనాన్ని రప్పించారు. తెనాలి వాహనంలో లిఫ్ట్‌ పనిచేయకపోవటంతో దుగ్గిరాల నుంచి 1962 మొబైల్‌ అంబులెన్స్‌ను పిలిపించారు. గాయపడిన ఎద్దును మొబైల్‌ వాహనంలోని లిఫ్ట్‌ సాయంతో అందులోకి ఎక్కించి, గన్నవరం తరలించారు.

■ మనుషులకు 108 అంబులెన్స్‌ వాహనం తరహాలోనే పశువులకు ప్రమాదం జరిగినపుడు అత్యవసర వైద్యసేవల కోసమని గత వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం 1962 మొబైల్‌ అంబులేటరీ వెటర్నరీ వాహనాలను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. గాయపడిన పశువుల వద్దకు నేరుగా వెళ్లి వైద్యం చేయటం, సాధ్యం కాకపోతే పశువును లిఫ్ట్‌ చేసి, ఆస్పత్రికి తరలించి వైద్యం చేసేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ఇప్పుడు పొరుగు జిల్లాకు వెళ్లటం నిబంధనలకు విరుద్ధమైనా, పరిస్థితి తీవ్రతతో ఉన్నతాధికారులు, ఈఎంఆర్‌ఐను జేడీఏ డాక్టర్‌ నరసింహారావు ఫోనులో సంప్రదించి, వారి అనుమతితో తరలించారు. తెనాలి పశువైద్యశాల అసిస్టెంట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బి.నాగిరెడ్డి, డాక్టర్‌ జి.నరేంద్ర, ఆలపాటి వెంకట్రామయ్య, సిబ్బంది సహకరించారు.

'కొండవీటి కళారేఖ' కావ్యావిష్కరణ



ఆవిష్కరణలో కల్లి శివారెడ్డి తదితరులు

నరసరావుపేట ఈస్ట్‌: కొండవీడు పాలకుల సాహితీ సేవ, ప్రజారంజక పాలనను చారిత్రక పద్య కావ్యంగా తీసుకురావడం అభినందనీయమని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కల్లి శివారెడ్డి తెలిపారు. శ్రీనాథ సాహితీ పరిషత్‌ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ హాలులో విశ్రాంత ప్రిన్సిపాల్‌, పద్యకవి డాక్టర్‌ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి రచించిన 'కొండవీటి కళారేఖ' చారిత్రక పద్య కావ్యాన్ని శివారెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ సాహితీలోకంలో డాక్టర్‌ చేరెడ్డి ధ్రువతారగా నిలిచిపోతారని కొనియాడారు. పుస్తక సమీక్షకులు డాక్టర్‌ పోలేపెద్ది రాధాకృష్ణమూర్తి, డాక్టర్‌ మేళ్లచెర్వు భానుప్రసాదు మాట్లాడుతూ మస్తాన్‌రెడ్డి కలం పట్టి పద్యం రాయడం మొదలు పెట్టి 60 వసంతాలు నిండాయని తెలిపారు. ఆయన రచించిన 'అఖండ యోగి' పాఠకుల మన్ననలు పొందిందని పేర్కొన్నారు. కొండవీటి కావ్యరేఖ సైతం అందరి హృదయాలలో నిలిచిపోతుందని వివరించారు. అనంతరం గాయత్రీ పరివార్‌ సత్సంగ్‌, సంస్కృత సంధ్యా, సద్గురు కళాసమితి ఆధ్వర్యంలో డాక్టర్‌ చేరెడ్డి మస్తాన్‌రెడ్డిని పద్య కళానిధి బిరుదుతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనాథ సాహితీ పరిషత్‌ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, ఆయా సంస్థల ప్రతినిధులు డాక్టర్‌ పోపూరి గోపాలకృష్ణమూర్తి, డాక్టర్‌ వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్‌, పి.వి.ఎస్‌.ఆర్‌. ప్రసాదరావు పాల్గొన్నారు.